క్లుప్తంగా

చెంగాళమ్మకు రూ.1.28 కోట్ల ఆదాయం



వేలం పాటలో పాల్గొన్న అధికారులు

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో శనివారం నిర్వహించిన దుకాణాల వేలం పాటల ద్వారా రూ.1,28,76,000 కోట్ల ఆదాయం వచ్చిందని దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, ఆలయ ఈఓ వెంకట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో వివిధ దుకాణాలను నిర్వహణ హక్కుల కోసం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆలయం ఆవరణలో వేలం పాటలు నిర్వహించారు. ఈ పాటల్లో రూ.1,28,76,000 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. ఈ ఆదాయం గత ఏడాది కన్నా రూ.26.17 లక్షలు అధికమని వారు తెలిపారు. దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు గెస్ట్‌హౌస్‌లు ప్రారంభం

తడ: బీవీపాళెం, పులికాట్ సరస్సు ఒడ్డున నిర్మించిన ఏపీ టూరిజం గెస్ట్ హౌస్‌లను ఆదివారం ప్రారంభించనున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. 'పులికాట్ లేక్ వ్యూ రిసార్ట్స్' పేరుతో నిర్మించి ఈ గెస్ట్ హౌస్‌లతోపాటు రెస్టారెంట్‌ను కూడా ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ టూరిజం మంత్రి ఆర్కే రోజా, అతిథులుగా ఎంపీ మద్దెల గురుమూర్తి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హాజరు కానున్నారని చెప్పారు.

విచారణ వాయిదా

చిల్లకూరు: బూదనం పంచాయతీలో నిధుల దుర్వినియోగం ఫిర్యాదులపై శనివారం గ్రామంలో చేపట్టిన వివాచారణ వాయిదా పడింది. గూడూరు డివిజన్ పంచాయతీ అధికారి వెంకటరమణ గ్రామంలో విచారణకు హాజరు కావాలని గతంలో పని చేసిన ముగ్గురు పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు జారీ చేశారు. అయితే వారిలో ఇద్దరు మాత్రమే విచారణకు హాజరు కాగా ప్రస్తుతం పనిచేస్తున్న పంచాయత కార్యదర్శి గైర్హాజరయ్యారు. దీంతో రికార్డులు లేక విచారణను వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ

దొరవారిసత్రం: మండలంలోని ఆనేపూడి ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఈఓ కృష్ణయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జగనన్న గోరు ముద్ద పథకాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలోని రికార్డులను తనిఖీ చేశారు.

కండలేరులో 12.157 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 12.157 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 160 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 360 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దుప్పట్లు, ప్లేట్ల పంపిణీ



దుప్పటి, ప్లేటు అందజేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ భానుప్రియ

సైదాపురం(వెంకటగిరి): మున్సిపల్ చైర్‌పర్సన్ భానుప్రియ, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్ వెంకటేశ్వర్లు వెంకటగిరి బాలసదన్‌లో చిన్నారులకు శనివారం దుప్పట్లు, భోజన పేట్లు, క్యారీ బాక్సులు పంపిణీ చేశారు. కౌన్సిలర్ కళ్యాణి, కే వెంకటసుబ్బయ్య, రామ్మూర్తి, మస్తాన్, శ్రీనివాసులు, విజయ్ పాల్గొన్నారు.

బస్సుయాత్ర ఏర్పాట్ల పరిశీలన

కోట: మండల కేంద్రంలో ఆదివారం జరగనున్న సామాజిక సాధికార బస్సుయాత్ర ఏర్పాట్లను వైఎస్సార్ సీపీ నేతలు శనివారం పర్యవేక్షించారు. యాత్ర సందర్భంగా పట్టణంలోని ఎన్‌సీఆర్ నగర్ వద్ద ఉన్న గోపాల్‌రెడ్డి విగ్రహం నుంచి సభావేదిక, గాంధీబొమ్మ సెంటర్ వరకు భారీ ర్యాలీ చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. మేరిగ మురళీధర్, పార్టీ మండల కన్వీనర్ సంపత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

వాకాడు: కోటలో నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎన్ ఉదయ్‌శేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన వాకాడులో మాట్లాడుతూ కోటలో పార్టీ ముఖ్య నేతలతో భారీ బహిరంగసభ, బస్సుయాత్ర జరుగుతుందన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

దొరవారిసత్రం: మండలంలోని కట్టువాపల్లెలో శనివారం వైద్యశిబిరం ఏర్పాటు చేసి, రోగులకు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. పీహెచ్‌సీ డాక్టర్ చంద్రకళ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: వైఎస్సార్ సీపీ విజయానికి అహర్నిశలు కృషి చేస్తామని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆయన పట్టణంలోని తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయ చరిత్రలో ఎక్కడా లేని విధంగా స్థానిక ఎమ్మెల్యేని పక్కన పెట్టి, పార్టీ బాధ్యతలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు అప్పగించారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా వైనాట్ 175 అనే నినాదంతో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వెంకటగిరి నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తనూ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నానని, ఏవైనా లోపాలుంటే సరిచేసుకుంటానని చెప్పారు. నేదురుమల్లికి టికెట్ ఇస్తే పని చేయమంటూ ఓ దినపత్రికలో వచ్చిన వార్తను ఆయన తీవ్రంగా ఖండించారు.

29న టిడ్కో గృహాల పంపిణీ

వెంకటగిరిలోని టిడ్కో గృహాలను ఈ నెల 29వ తేదీన లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధం చేశామని నేదురుమల్లి తెలిపారు. 1800 టిడ్కో గృహాలు నిర్మాణంలో ఉండగా 1,008 గృహాలు పూర్తి అయ్యాయని చెప్పారు. వీటిని జిల్లా ఇన్‌చార్జి మంత్రుల చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తెలిపారు. అలాగే జగన్న కాలనీ ఎదురుగా 110 ఎకరాల్లో నగరవనం మంజూరైందని, ఆ వనం పనులు పూర్తయితే ఆ ప్రదేశంలో ఎంతో ఆహ్లాదకంతో అభివృద్ధి చెందుతుందన్నారు. వెంకటగిరిని మరింత అభివృద్ధి చేయడానికి ఐఐటీ, ఐఎస్ఆర్ వంటి కంపెనీలను స్థాపించేందుకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

అభివృద్ధికి ఆనం అడ్డుకట్ట

వెంకటగిరి నియోకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి అడ్డుకట్టగా నిలిచారని నేదురుమల్లి ఆరోపించారు. ఆనం రామనారాయణరెడ్డి అవినీతి అనకొండగా మారారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ జీఓ ప్రకారం జగనన్న కాలనీలో 1.5 సెంట్లు భూమిని కేటాయిస్తే రోడ్డు మార్జిన్ ముందు ఉన్న భూమిని కలిపి రెండు సెంట్లుగా చేసి, ఆయన అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. వెంకటగిరిలో ఆయన చేసిన అభివృద్ధి ఏమీ లేదని అంతా దోచుకోవడమే ధ్యేయంగా ఉన్నారన్నారు. ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులు అడ్డుకోవడమే కాకుండా మోపూరు, లింగసముద్రం చెరువు అభివృద్ధి పనులను అడ్డుకున్న ఘనత ఆయనకే తగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భానుప్రియ, నెల్లూరు జిల్లా గ్రంథాలయసంస్థ చైర్‌పర్సన్ డీ శారద, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, మున్సిపల్ విప్ పూజారి లక్ష్మి, వైస్ చైర్మన్లు ఎస్ బాలయ్య, సీహెచ్ ఉమామహేశ్వరి, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నమ్మకాన్ని వమ్ము చేయను



మేరిగ మురళీధర్‌ను సత్కరిస్తున్న నరేంద్రరెడ్డి

గూడూరురూరల్: కార్యకర్తలు, నాయకులు, తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయనని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ అన్నారు. మండలంలోని మంగళపూరులో వైఎస్సార్‌సీపీ నాయకుడు వై నరేంద్రరెడ్డి నివాసంలో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గతంలో పార్టీలో గెలిచిన కొందరు మరో పార్టీలో చేరి రూ.కోట్లు గడించి, ప్రజల నమ్మకాన్ని నట్టేట ముంచారని పరోక్ష విమర్శలు చేశారు. అయితే తాను గూడూరు ప్రజలకు అందుబాటులో ఉండి అర్ధరాత్రి తన తలుపు తట్టినా అందుబాటులో ఉండేలా ప్రతి ఒక్కరి నమ్మకాన్ని నిలబెడతానని హామీ ఇచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకంతోనే ఎమ్మెల్సీగా ఎంపిక చేశారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు మంచి మనస్సుతో తన విజయం కాంక్షిస్తున్నారని, అది తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆదివారం కోటలో జరిగే సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కదలి రావాలన్నారు. అనంతరం వై నరేంద్రరెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడేవారికి అందుబాటులో ఉండేలా సమన్వయకర్తను నియమించారని చెప్పారు. పార్టీ మండల కన్వీనర్ ఎం విజయకుమార్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బాబురెడ్డి, 24 సొసైటీ చైర్మన్ ఏ శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ గురవయ్య, పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సునీల్‌రెడ్డి, నాయకులు మధురెడ్డి, రాజారెడ్డి, విద్యాసాగర్, ఎస్ శ్రీనివాసులరెడ్డి, వీ నాగరాజు, సర్పంచ్‌లు బీ వెంకటేశ్వర్లు, విజయభాస్కరరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణం



స్వామిఅమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఉదయం అభిషేకం, సుప్రభాతం, పూలంగిసేవ చేశారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను నిత్యకల్యాణ మండలపంలో కొలువుదీర్చి వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి, శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్‌సేవ నిర్వహించారు.

న్యాయబద్ధంగానే మైనింగ్

వెంకటగిరిరూరల్: నియోజకవర్గంలోని సైదాపురంలో మైనింగ్ పనులు న్యాయబద్ధంగానే జరుగుతున్నాయని, రాజా కుటుంబీకులు సర్వజ్ఞ కుమార యాచేంద్ర పేర్కొన్నారు. శనివారం నేదురుమల్లి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వాటాలు ర్వావడం లేదన్న అక్కసుతో కొందరు లేనిపోని ఆరోపణలు చేస్తున్నట్లు తెలిపారు. వాస్తవానికి మైనింగ్ తరలించాలంటే 19 శాఖల అనుమతులు తీసుకుని, సీపీఎస్ సిస్టమ్ ఉన్న వాహనంలోనే తరలించాలన్నారు. ప్రస్తుతం ఆ పద్ధతిలోనే సైదాపురంలో మైనింగ్ జరుగుతున్నట్లు తెలిపారు.

ఘనంగా పల్లకీ సేవ



పల్లకిలో ఊరేగుతున్న కోదండరామస్వామి

చిల్లకూరు: మండలంలోని తమ్మినపట్నంలో ఉన్న కోదండరామాలయంలో స్వామివారికి శనివారం పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. తరువాత స్వామివారికి పల్లకీ సేవను నిర్వహించారు. అలాగే కలవకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి, స్వామివారికి అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం లక్ష్మీనరసింహస్వామికి పల్లకీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఈఓలు జానకి, తాతా శ్రీనివాస్‌రావు పర్యవేక్షించారు.

ముగిసిన నియోజకవర్గ స్థాయి పోటీలు



క్రీడాకారులను అభినందిస్తున్న అధికారులు

వెంకటగిరిరూరల్: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. నాలుగురోజులుగా జరిగిన ఈ పోటీల్లో 10 జట్లు జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. క్రికెట్ పురుషుల విభాగంలో వెంకటగిరి బంగారుపేట జట్టు, బ్యాడ్మింటన్ వెంకటగిరి రాణిపేట, కబడ్డీ డక్కిలి మండలం మాధవాయిపాళెం, ఖోఖో డక్కిలి మండలం డీ వడ్డిపల్లె, వాలీబాల్ వెంకటగిరి ఎన్టీఆర్ కాలనీ జట్లు, మహిళ విభాగంలో క్రికెట్ వెంకటగిరి రూరల్ పెట్లూరు, వాలీబాల్ బాలాయపల్లె మండలం అలిమిలి, కబడ్డీ, ఖోఖో రాపూరు మండలం కంబాలపల్లె, వాలీబాల్ వెంకటగిరి మండలం పెట్లూరు జట్లు ఎంపికయ్యాయని తెలిపారు.

రూ.20 కోట్లతో బడ్జెట్ ఆమోదం



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

నాయుడుపేట: మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.20 కోట్లతో బడ్జెట్ ఆమోదం తెలిపినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం నాయుడుపేట పురపాలక సంఘం సంబంధించిన బడ్జెట్ అంచనాలు 2024-2025 ఆర్థిక సంవత్సరం ఆమోదం కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక అధ్యక్షత వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రూ.10 కోట్లు ఆర్థిక సంఘం నిధులు, మరో రూ.10 కోట్లు జనరల్ ఫండ్స్, ఎస్సీ కార్పొరేషన్ వాటర్ చార్జీలు, షాపింగ్ కాంప్లెక్స్ ఇతర నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ నిధులు ఖర్చు చేసేందుకు కౌన్సిల్ ఆమోదం తీసుకుని, అభివృద్ధి పనులు చేయనున్నామని చెప్పారు. గత బడ్జెట్ కన్నా 2024-25 బడ్జెట్‌లో అత్యధిక భాగం తడి,పొడి చెత్త ప్లాంట్లకు కేటాయింపులు జరిగాయన్నారు. మిగిలిన నిధులు తాగు నీరు, మురుగు కాలువలు, రోడ్లు, వీధి దీపాలు, పార్కుల అభివృద్ధికి కేటాయించామని తెలిపారు. అలా గే ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో అభివృద్ధికి 15 శాతం నిధులు కేటాయించినట్లు తెలిపారు. మున్సిపాలిటీలోని నక్కలోళ్ల సెంటర్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో మున్సిపాలిటీ దుకాణ సముదాయం నిర్మించి, మున్సిపల్ రాబడికి మార్గదర్శకం కావాలని వైస్ చైర్మన్ షేక్ రఫీ, పసల చిన్న పెంచలయ్య వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్లు జే వెంకటకృష్ణారెడ్డి, షేక్ రఫీ, కౌన్సిలర్లు చంద్రారెడ్డి, డీ రవి, పీ నాగార్జున, అశోక్‌కుమార్, ఆర్ సరిత, పీ చినపెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత సూళ్లూరుపేట జట్టు



షీల్డు అందుకుంటున్న సూళ్లూరుపేట జట్టు

సూళ్లూరుపేట: ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో భాగంగా శనివారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి క్రికెట్ ఫైనల్స్‌లో సూళ్లూరుపేట (మన్నారుపోలూరు) జట్టు విజేతగా నిలిచి, జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించింది. సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన నియోజకవర్గ స్థాయి క్రికెట్‌పోటీల్లో నాయుడుపేట జట్టుపై మన్నారుపోలూరు జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు ఆర్డీఓ చంద్రముని, కమిషనర్ నరేంద్ర కుమార్ ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా రూ.35 వేలు నగదు బహుమతి, షీల్డ్ అందజేశారు. రన్నర్‌గా నిలిచిన నాయుడుపేట జట్టుకు రూ.10 వేలు, మూడోస్థానంలో నిలిచిన పెళ్లకూరు జట్టుకు రూ.5 వేలు నగదు బహుమతులను అందజేశారు. పీడీ భాస్కర్, సచివాలయ సిబ్బంది పురిణి కృష్ణయ్య, ఎస్ తేజస్విని, జీ నిఖిల్, ఎం రాజేశ్వరి క్రీడాకారులను అభినందించారు.

నేతలకు రాజ్యలక్ష్మి పరామర్శ



రమణయ్యను పరామర్శిస్తున్న మాజీమంత్రి రాజ్యలక్ష్మి

డక్కిలి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి శనివారం డక్కిలి మండలంలోని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, నేదురుమల్లి అభిమానులను పరామర్శించారు. కోనేశ్వరభట్లపల్లె(తూర్పుపల్లె)కు చెందిన కే రమణయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయన్ని ఆమె పరామర్శించారు. ఇంకా పాతనాలపాడు వైఎస్సార్‌సీపీ నాయకుడు జీ అరుణాచలం మాతృమూర్తి లక్ష్మమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆయన్ని కూడా పరామర్శించారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు పీ గోపాల్ యాదవ్, కే వెంకటస్వామి, కృష్ణ తదితరులు ఉన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం

పెళ్లకూరు: దేశంలో పేదల అభ్యున్నతే ప్రధాని మోదీ ప్రధాన లక్ష్యమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి అన్నారు. శనివారం కొత్తూరు, రావులపాడు గ్రామాల్లో జరిగిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం రాయితీపై వంట గ్యాస్ సిలిండర్, స్టౌవ్, రెగ్యులేటర్ తదితర సామగ్రిని లబ్ధిదారులకు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్‌బాబు, పార్టీ మండల అధ్యక్షుడు మురళి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందనలు



విజేతలను అభినందిస్తున్న అధికారులు

గూడూరురూరల్: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా గూడూరులో శనివారం జరిగిన నియోజకవర్గ స్థాయి పలు పోటీల్లో విజేతలను పలువురు అభినందించారు. బాల్ బాడ్మింటన్ పురుషుల విభాగంలో తూర్పువీధి సచివాలయానికి చెందిన హర్షవర్ధన్, ఎస్‌డీ బషీర్ మొదటి స్థానం, వాకాడు సచివాలయానికి చెందిన జయంత్, సాల్మన్‌రాజ్ రెండో స్థానం, చిట్టమూరు గునపాటిపాళేనికి చెందిన వెంకటరమణయ్య, వినయ్ మూడోస్థానంలో నిలిచారు. మహిళల విభాగంలో గూడూరు మసీద్ సెంటర్ సచివాలయ సిబ్బంది సాయిభవ్య, ఎస్‌కే ఫరాహీన్ ప్రథమ, వాకాడు నెల్లిపూడికి చెందిన ఏ కస్తూరమ్మ, ప్రత్యూష ద్వితీయ, కోట మండలం చిట్టేడుకు చెందిన డేగా కోటమ్మ, ఎస నాగమణి తృతీయస్థానంలో నిలిచారు. ఖోఖోలో నియోజకవర్గ పురుష విభాగంలో వాకాడు మండలం పూడిరాయిదొరువుకు చెందిన క్రీడాకారులు విజేతగా నిలిచారు. రెండవ స్థానంలో చిట్టమూరు మండలం క్రీడాకారులు నిలిచారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులను ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, కో ఆర్డినేటర్, శివకుమార్, పీఈటీలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, కరిముల్లా, రమేష్, మహీపతి, సందానీ బాషా, ధనుంజయ, విజయ, తదితరులు అభినందించారు.

సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేఖర్‌రెడ్డి

పెళ్లకూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీపీ శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం చిల్లకూరు సచివాలయ ప్రాంగణంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి పలు ప్రాంతాల నుంచి వ్యాధిగ్రస్తులు విచ్చేసి పరీక్షలు చేయించుకున్నారు. శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 108, 104 సదుపాయాలతోపాటు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నారన్నారు. అలాగే ఆరోగ్య సురక్షలో భాగంగా తొలుత వైద్యులు, వైద్య సిబ్బంది గ్రామాల్లోని ఇళ్లలో సర్వే చేసి, రోగులను గుర్తించి, వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, మెరుగైన వైద్యం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పీ హరిబాబురెడ్డి, కే శివకుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, తహసీల్దార్ రామయ్య, ఎంపీడీఓ సురేష్‌బాబు డాక్టర్ ఉమ, డాక్టర్ సుజాత, కార్యదర్శి శ్రీహరి పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



పక్కకు ఒరిగిపోయిన ట్రిప్పర్

సైదాపురం: మండల కేంద్రంలో ఓ టిప్పర్ అదుపుతప్పి రోడ్డు పక్కకు వెళ్లి దిగబడిపోయి, ఒరిగిపోయింది. ఆ సమయంలో అక్కడ ఉన్న ఇద్దరు వ్యక్తులు చాకచక్యంగా తప్పించుకున్నారు. దీంతో ప్రమాదం తప్పింది.

సమస్యల పరిష్కారానికే సదస్సులు



ప్రజల సమస్యలు వింటున్న నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్

కలువాయి: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కలువాయి రెవెన్యూ కార్యాలయ అవరణలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కలువాయి, రాపూరు, సైదాపురం మండలాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలు, వివాదాలు అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సు ఒక మంచి వేదిక అన్నారు. అనంతరం నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ట్రైనీ కలెక్టర్ సంజనాసిన్హా, ఆర్డీఓ మధులత, జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ ఆర్ లక్ష్మీదేవి, పార్టీ మండల కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఎం యజ్ఞపవన్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు

వాకాడు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్ ప్రసాద్‌రావు కోరారు. శనివారం ఆయన బాలిరెడ్డిపాళెం, యరగాటిపల్లెలో పర్యటించి రైతులు సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. అనంతరం ఆయన ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. అనంతరం వ్యవసాయ శాఖ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 31వ తేదీ లోపు ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ దీప, పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పని సరి

కోట: రైతులు తాము సాగు చేసిన పంటలకు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు సూచించారు. శనివారం మండలంలోని నెల్లూరుపల్లె, కోట రైతుభరోసా కేంద్రాలను పరిశీలించి, రబీసీజన్‌లో ఈ-క్రాప్ నమోదు వివరాలు తెలుసుకున్నారు. కొక్కుపాడు, వెంకన్నపాళెంలో పంటపొలాలను పరిశీలించి ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులతో మాట్లాడారు. ఏఓ నిరంజన్‌కుమార్ పాల్గొన్నారు.

కమిషనర్‌కు సన్మానం



మున్సిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న కౌన్సిలర్లు

నాయుడుపేట: మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రావును మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు సన్మానించారు. చైర్‌పర్సన్ కే దీపిక, వైస్ చైర్మన్లు వెంకటకృష్ణారెడ్డి, షేక్ రఫీలతోపాటు కోఆప్షన్ సభ్యుడు చదలవాడ కుమార్ ఈ సందర్భంగా ఆయనకు శాలువ కప్పి, సత్కరించారు. కౌన్సిలర్లు డీ రవి, ఆర్ సరిత, అశోక్, పీ చిన పెంచలయ్య, చంద్రారెడ్డి, శాంతమ్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చిల్లకూరు: మండలంలోని వరగలి క్రాస్ రోడ్డు సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. గూడూరు పట్టణానికి చెందిన దినకర్ అనే వ్యక్తి ప్రైవేట్ చానల్‌లో పని చేస్తున్నాడు. ఇతను తన సొంత పనుల నిమిత్తం మోటారుసైకిల్‌పై ఓజిలికి వెళ్లి, తిరిగి గూడూరుకు వస్తుండగా వరగలి క్రాస్ రోడ్డు సమీపంలో వెనుకన వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. దీంతో అతడు తీవ్రంగా గాయపడి, రోడ్డుపై పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి 108కి సమాచారం ఇచ్చారు. ఆ వాహన సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని అతడిని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.